

## పెట్టుబడులు భళా..

ఏ రాష్ట్రమైనా.. దేశమైనా ఆర్థిక పురోగతి దిశలో పయనిస్తుందో లేదో తెలుసుకోవాలంటే ఆ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులే గీటురాయి. ఈ విషయంలో సింగపూర్ వంటి దేశాలతో తెలంగాణ పోటీపడుతున్నట్టు పారిశ్రామికవేత్తలు చెప్తున్నారు.

| ఆర్థిక సంవత్సరం | పెట్టుబడుల ప్రతిపాదనలు | పూర్తైన ప్రాజెక్టుల విలువ |
|---|---|---|
| 2021-22 | రూ. 85,087 కోట్లు | రూ. 22,380 కోట్లు |
| 2022-23 | రూ. 1,33,102 కోట్లు | రూ. 24,910 కోట్లు |
| 2023-24 | రూ. 1,06,921 కోట్లు | రూ. 27,090 కోట్లు |

## ప్రధాన వస్తు ఎగుమతులు

ఉత్పత్తి, ఎగుమతులపైనే రాష్ట్రానికి అదనపు ఆదాయమూ, జీఎస్డీపీలో పెరుగుదల ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో తెలంగాణ అంచెలంచెలుగా ఎదిగింది.

| ఆర్థిక సంవత్సరం | ఎగుమతుల విలువ |
|---|---|
| 2020-21 | రూ. 64,539 కోట్లు |
| 2021-22 | రూ. 81,971 కోట్లు |
| 2022-23 | రూ. 91,776 కోట్లు |
| 2023-24 | రూ. 1,16,527 కోట్లు |

# కేసీఆర్ పాలనలో.. తెలంగాణ కొత్త శిఖరాలకు

- దేశీయ ఐటీ ఎగుమతుల్లో 31% వాటా రాష్ట్రానిదే
- జీఎస్డీపీ, తలసరి, సాగు విస్తీర్ణం అన్నింటా రికార్డే
- 2020-21 నుంచి మూడేండ్లకుగాను ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ తాజా నివేదికలో వెల్లడి
- పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ మారింది: ఎంఎస్ఎంఈ ఈపీసీ చైర్మన్ డాక్టర్ డీఎస్ రావత్

మూడేండ్లలో 3.25 లక్షల కోట్ల పెట్టుబడులు



### స్థాపిత విద్యుత్తు సామర్థ్యం

ఉమ్మడిపాలనలో అంధకారంలో ఉన్న తెలంగాణను వెలుగుల దివ్వెగా కేసీఆర్ తీర్చిదిద్దారు. స్థాపిత విద్యుత్తు సామర్థ్యంలో కనిపించిన పెరుగుదలే దీనికి నిదర్శనం.

| | |
|---|---|
| 2020-21 | 14,041.7 మెగావాట్లు |
| 2021-22 | 14,892.9 మెగావాట్లు |
| 2022-23 | 15,039.1 మెగావాట్లు |

### కంపెనీల రిజిస్ట్రేషన్లు

కంపెనీల ఏర్పాటు పెరిగితే ఆ రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నట్టు భావించాలి. ఫ్యాక్టరీల ఏర్పాటులో, కంపెనీల రిజిస్ట్రేషన్లలో తెలంగాణ దూసుకుపోయింది.

**26 లక్షలు** తెలంగాణలో ఉన్న మొత్తం ఎంఎస్ఎంఈలు (2023లో)

**56%** గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈలు (2023లో)

**44%** పట్టణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈలు (2023లో)

#### కంపెనీల రిజిస్ట్రేషన్లు

| | |
|---|---|
| 2020-21 | 1,23,599 |
| 2021-22 | 1,34,520 |
| 2022-23 | 1,44,775 |
| 2023-24 | 1,57,064 |

#### కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటు

| | |
|---|---|
| 2020-21 | 15,342 |
| 2021-22 | 13,251 |
| 2022-23 | 13,063 |

2016లో తెలంగాణలో స్టార్టప్స్ 400 | 2022లో తెలంగాణలో స్టార్టప్స్ 2000

**మనమే 10% ఎక్కువ**

**8.09%** మూడేండ్లలో దేశవ్యాప్తంగా ఐటీ ఎగుమతుల్లో వృద్ధి

**17.93%** మూడేండ్లలో తెలంగాణ ఐటీ ఎగుమతుల్లో వృద్ధి

**2023-24 ఆర్థిక సంవత్సరంలో..**

**31%** దేశీయ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా

**16.7%** దేశీయ ఐటీ ఉద్యోగాల్లో తెలంగాణ వాటా

**3 లక్షలు** 2027నాటికి తెలంగాణ ఐటీ రంగంలో వచ్చే కొత్త ఉద్యోగాలు

**23%** (అంచనా) 2027నాటికి ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి



### జీఎస్డీపీలో పెరుగుదల

ఒక రాష్ట్ర ప్రగతికి జీఎస్డీపీనే కొలమానం. దేశ జనాభాలో 2.9 శాతం వాటా మాత్రమే కలిగిన తెలంగాణ.. దేశ జీడీపీలో 5.2 శాతం మేర వాటా కలిగి ఉన్నది

| | |
|---|---|
| 2020-21 | 9,43,078 కోట్లు |
| 2021-22 | 11,24,086 కోట్లు |
| 2022-23 | 13,11,823 కోట్లు |
| 2023-24 | 15,01,981 కోట్లు |

### తల'సిరి'లో టాప్

రాష్ట్ర ఆర్థిక పురోగతికి తలసరి ఆదాయ వృద్ధి కూడా ముఖ్యమే. పౌరుల తలసరి ఆదాయం పెరుగుదలలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నది.

| ఆర్థిక సంవత్సరం | తలసరి ఆదాయం |
|---|---|
| 2020-21 | రూ. 2,50,825 |
| 2021-22 | రూ. 2,97,251 |
| 2022-23 | రూ. 3,45,225 |
| 2023-24 | రూ. 3,93,384 |

### దార్శనికుడు కేసీఆర్

ముందుచూపుతో వందేండ్ల అభివృద్ధికి అవసరమైన రోడ్డుమ్యాప్‌ను రూపొందించి పసిగుడ్డు తెలంగాణను పరుగులు పెట్టించారు. దానిఫలితమే తెలంగాణ ఆర్థికపురోగతికి అవసరమైన అన్ని రంగాల్లో ఎంతో ఎత్తులో నిలిచింది. మొన్నటి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అయినా.. నిన్నటి రాష్ట్ర గణాంక నివేదిక-2024 (అట్లాస్) అయినా.. నేటి ఎంఎస్ఎంఈ రిపోర్ట్ అయినా.. ఇలా ఏ నివేదికను తెరిచిచూసినా.. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ కొత్త శిఖరాలకు ఎదిగిందనేది సుస్పష్టమవుతున్నది.

**అభివృద్ధిలో ఎవరికీ అందకుండా దూసుకుపోతున్న సింగపూర్ వంటి దేశంతో సమానంగా మన తెలంగాణ పెట్టుబడులను ఆకర్షించడంలో కొత్త రికార్డులను నమోదు చేసింది. తెలంగాణే ఆత్మగా, శ్వాసగా ప్రేమించే భూమిపుత్రుడు కేసీఆర్ దూరదృష్టిని ఎన్ని కొలమానాలు కూడా తూచలేవు. ఇది నిజం. కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి కంపెనీల ఏర్పాటు, పెట్టుబడులు, ఆర్థికాభివృద్ధి వంటి కీలక అంశాలపై అధ్యయనం చేసే ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ తాజా నివేదిక గణాంకాలతో సహా కొనియాడింది.**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): అరచేయితో సూర్యకాంతిని ఎంతోకాలం ఆపలేరు. వాస్తవాలను అబద్ధపు ప్రచారంతో నిలువరించలేరు. కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని విమర్శలు గుప్పిస్తున్న వారికి చెంపపెట్టులాంటి వార్త ఇది. పెట్టుబడులను ఆకర్షించడంలో, కంపెనీల ఏర్పాటులో, ఉద్యోగకల్పనలో, సాగు విస్తీర్ణాన్ని పెంచడంలో, ధాన్యం ఉత్పత్తిలో, రాష్ట్రాన్ని విద్యుత్తు దివ్వెగా మార్చడంలో, తలసరి ఆదాయంలో, జీఎస్డీపీలో ఇలా ప్రతీ అంశంలో దేశంలో మరే రాష్ట్రమూ సాధించని ఘనతను అతికొద్దికాలంలోనే తెలంగాణ సాధించింది. ఈ మేరకు 'స్టడీ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్, డెవలప్‌మెంట్ అండ్ గ్రోత్ ఇన్ ప్రొగ్రెసివ్ తెలంగాణ అండ్ ఎమర్జింగ్ అన్‌లిమిటెడ్ అపార్చునిటీస్' పేరిట ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ బుధవారం విడుదల చేసిన నివేదికతో తేటతెల్లమైంది. 2020-21 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో జరిగిన సర్వోన్నతార్థికాభివృద్ధిని ఈ నివేదిక గణాంకాలతో సహా వివరించింది.

#### మూడేండ్లలో రూ. 3.25 లక్షల కోట్లు

ఏ రాష్ట్రమైనా ఆర్థిక పురోగతి దిశలో పయనిస్తుందో లేదో తెలుసుకోవాలంటే ఆ రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులే గీటురాయి. కేసీఆర్ పాలనలో తెలంగాణకు పెట్టుబడుల వరదపారిందన్న విషయం ఇప్పటికే పలు నివేదికల్లో వెల్లడైంది. తాజాగా ఎంఎస్ఎంఈ విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం సుస్పష్టమైంది. 2021-22 నుంచి 2023-24 మధ్య తెలంగాణకు కొత్త పెట్టుబడుల ప్రతిపాదనలు రూ. 3,25,110 కోట్ల మేర వచ్చినట్టు నివేదిక తేల్చిచెప్పింది. మూడేండ్లలో వచ్చిన రూ.3.25 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనల్లో పూర్తైన ప్రాజెక్టుల విలువ రూ.75 వేల కోట్లుగా ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.

#### ఏడాదిలోనే ఎంతో వేగంగా..

రాష్ట్ర ఆర్థిక పురోగతికి కొలమానంగా నిలిచే జీఎస్డీపీ, తలసరి ఆదాయం పెరుగుదలలో ఒక్క ఏడాదిలోనే తెలంగాణ కొత్త రికార్డులను నమోదు చేసింది. 2022-23లో జీఎస్డీపీ రూ.13,11,823 కోట్లుగా ఉంటే.. 2023-24నాటికి అది రూ.15,01,981 కోట్లకు చేరింది. 2022-23లో తలసరి ఆదాయం రూ.3,45,225గా ఉంటే ఆ మరుసటి ఏడాదికి రూ.3,93,384కు పెరిగింది. ఈ మేరకు ఎంఎస్ఎంఈ నివేదిక వెల్లడించింది.

#### సేవల రంగంలో తెలంగాణ పరుగులు

ఐటీ, పారిశ్రామిక రంగంలో పదేండ్ల బీఆర్ఎస్‌పాలనలో చేపట్టిన విప్లవాత్మకమైన కార్యక్రమాల కారణంగా సేవల రంగంలో తెలంగాణ దేశంలోనే టాప్ ప్లేస్‌లో నిలిచింది. 2014తో పోలిస్తే, 2023నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో జతచేరిన అదనపు విలువలో (గ్రాస్ స్టేట్ వ్యాల్యూయాడెడ్-జీఎస్‌వీఏ) వ్యవసాయరంగం ఏకంగా 165% మేర వృద్ధి రేటును సాధించింది. సాగువిస్తీర్ణంలో 117% పెంపు, ధాన్యం ముఖ్యంగా వరి దిగుబడి 350% మేర పెరుగడమే దీనికి కారణమని నివేదిక వెల్లడించింది. ఇదేసమయంలో జీఎస్‌వీఏలో సేవారంగం వాటా 62.9% నమోదైనట్టు నివేదిక వివరించింది. 2020-21లో రూ. 64,539 కోట్లుగా ఉన్న వస్తు ఎగుమతులు.. 2023-24కు వచ్చేనాటికి రూ.1,16,527 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు, కొత్త ఫ్యాక్టరీలు-స్టార్టప్‌ల ఏర్పాటు, స్థాపిత విద్యుత్తు సామర్థ్యంలో పెంపు, ఐటీ ఎగుమతులతో పాటు ఐటీ-ఐటీఈఎస్ రంగంలో కొత్త ఉద్యోగాలు కూడా గణనీయంగా పెరిగినట్టు నివేదిక వెల్లడించింది. స్టేట్ ఎకానమీలో పారిశ్రామిక రంగం వాటా 18.5% ఉన్నట్టు నివేదిక వివరించింది.



#### పెట్టుబడుల గమ్యస్థానం

2021-22 నుంచి 2023-24 మధ్య తెలంగాణలో పెట్టుబడుల వరదపారింది. దేశంలోని పారిశ్రామికవేత్తలకే కాకుండా విదేశీ ఇన్వెస్టర్లకు కూడా పెట్టుబడుల విషయంలో తెలంగాణ ఓ గమ్యస్థానంగా మారింది. –డాక్టర్ డీఎస్ రావత్, ఎంఎస్ఎంఈ ఈపీసీ చైర్మన్

#### సింగపూర్‌కు దీటుగా

"జనాభా, విస్తీర్ణాన్ని బేరీజువేసుకొని చిన్న రాష్ట్రాల ప్రాతిపదికన చూస్తే స్వతంత్ర భారతావనిలో మూడేండ్ల సమయంలో రూ.3.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వచ్చే పెట్టుబడులు తెలంగాణ వంటి రాష్ట్రం సాధించడం ఎంతో గొప్ప విషయం.

- ముంబైకి చెందిన ఓ పారిశ్రామికవేత్త

## యువతరానికి స్ఫూర్తి శివాజీ

**ఛత్రపతి చిత్రపటానికి హరీశ్, కవిత నివాళి**

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): ఛత్రపతి శివాజీ మహరాజ్ యువతరానికి స్ఫూర్తి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా బుధవారం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు స్పందిస్తూ 'విజనరీ లీడర్, భయమెరుగని గొప్ప యోధుడు. ఛత్రపతి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకం. ప్రజల సంక్షేమానికి జీవితం అంకితం చేసిన గొప్ప రాజు' అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా శివాజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఎక్స్‌లో స్పందిస్తూ నిజమైన స్వరాజ్యానికి శివాజీ నిలువుటద్దమని తెలిపారు. ప్రజల హక్కుల కోసం నిబద్ధతతో పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.

## ఇంకెన్ని తప్పుడు వార్తలు రాస్తరు?

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి ఆగ్రహం




హైదరాబాద్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ): మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌పై ఇంకెన్ని రోజులు తప్పుడు వార్తలు రాసి అసత్య ప్రచారం చేస్తారని ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంపై వీ6 డిజిటల్ పత్రికలో వచ్చిన కథనంపై ఆయన బుధవారం 'ఎక్స్' వేదికగా ఘాటుగా స్పందించారు. 'మనోళ్లే ముంచిండ్రు' అనే శీర్షికన ఆ పత్రిక డిజిటల్ ఎడిషన్‌లో ఓ కథనాన్ని వండివార్చినట్టు పేర్కొన్నారు. 'ఎంపీ ఎన్నికల్లో ఓడగానే బీఆర్ఎస్ పని అయిపోయిందని ప్రచారం చేశారని, నిరాశతో 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారిండ్రు' అంటూ అడ్డగోలు రాతలు రాసిందని ఫైర్ అయ్యారు.

## సిరిసిల్లలో మరో దుస్తుల పరిశ్రమ సిద్ధం

**నాడు ఒప్పందం.. నేడు ఆరంభం!**

- బీఆర్ఎస్ హయాంలో టీపీపీఎల్ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం
- త్వరలో దుస్తుల ఉత్పత్తి షురూ
- అంతర్జాతీయ బ్రాండ్ల తయారీ
- 2వేల మందికి ఉపాధి అవకాశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): సుమారు రూ.64 కోట్లతో షెడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు.. 1,000 మిషన్లు.. 2,000 మందికి ఉపాధి అవకాశాలు.. అంతర్జాతీయ స్థాయి బ్రాండ్ల ఉత్పత్తి.. ఈ ప్రత్యేకతలతో రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులో ప్రముఖ దుస్తుల తయారీ పరిశ్రమ టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (టీపీఎల్) ప్రారంభానికి సిద్ధమైంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ కంపెనీ ఏర్పాటుకు ఒప్పందం కుదిరి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధమైంది. ఈ మేరకు ఆ కంపెనీ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి కంపెనీ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. బెంగళూరుకు చెందిన టీపీఎల్ సంస్థ సిరిసిల్లలో దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు 2022 ఫిబ్రవరి 25న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. ఆనాటి ప్రభుత్వం ఆ కంపెనీకి సిరిసిల్ల సమీపంలోని పెద్దూరు అప్పారెల్ పార్క్‌లో 7.42 ఎకరాలను కేటాయించింది. 1.77 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో యూనిట్‌ను నెలకొల్పారు. ఒప్పందం ప్రకారం సుమారు రూ.64 కోట్లతో షెడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్తు, నీరు ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. కంపెనీ 1,000 మిషన్లతో 2,000 మందికి ఉపాధి కల్పించనున్నది. లోదుస్తులు, టీషర్టుల వంటివి ఇక్కడ తయారవుతాయి. అమెరికాకు చెందిన ప్రముఖ బ్రాండ్లు, రిటెయిలర్లు అయిన కోల్స్, రాబర్ట్ గ్రాహం ఎల్ఎల్‌సీ, టామీ హిల్ ఫిగర్, వ్యాన్స్, వీజీ యూరోప్ బీవీబీ, నాటికా, మైఖేల్ కోర్స్, ప్రైమార్క్ తదితర కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నది. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్‌కుకి కేంద్ర ప్రభుత్వం విదేశీ వాణిజ్య విధానం(ఎఫ్‌టీపీ) కింద ఎక్స్‌పోర్ట్ హౌస్ సర్టిఫికెట్‌ను కూడా ప్రదానం చేసింది. అంతర్జాతీయ వాణిజ్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే దేశీయ కంపెనీలకు ఈ సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు.

#### పెద్దూరులో రెండో అతిపెద్ద పరిశ్రమ ఇదే

పెద్దూరు అప్పారెల్ పార్క్‌లో గ్రీన్ నీడిల్ ఫ్యాక్టరీ తర్వాత టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ రెండో అతిపెద్ద దుస్తుల తయారీ కంపెనీ. గ్రీన్ నీడిల్ ఫ్యాక్టరీ అమెరికాలోని న్యూయార్క్‌కు ఆర్గానిక్ కాటన్ బాక్సర్ బ్రీఫ్‌లను ఎగుమతి చేస్తుండగా, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ పురుషులు, మహిళలు, పిల్లలకు నిట్టింగ్ ఫ్యాబ్రిక్స్(అల్లిక బట్ట)ను తయారు చేయడంతోపాటు ఎగుమతి చేస్తుంది. దేశీయ మార్కెట్‌కు కూడా అందిస్తుంది. ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కంపెనీ కార్యకలాపాలు సాగిస్తున్నది. అపెరల్ పార్క్ కోసం నైపుణ్యంగల ఉద్యోగులను తయారుచేసే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు సుమారు 3,000 మందికి శిక్షణ ఇప్పించింది. ఈ అపెరల్ పార్క్‌లో గోకల్‌దాస్ ఇమేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటికే 500 మంది ఉద్యోగులతో దుస్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పింది. సమీప భవిష్యత్తులో 1,000 మందికి ఉపాధి కల్పించే దిశగా దీన్ని విస్తరించనున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వస్త్ర పరిశ్రమను అభివృద్ధి చేయడంతోపాటు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న నేత కార్మికుల కోసం అనేక చర్యలు చేపట్టింది. టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌నకు చెందిన ప్రతినిధులు జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టెక్స్‌పోర్ట్ ప్రతినిధులు పెద్దూరులో రూ.60 కోట్లతో చేపట్టిన దుస్తుల తయారీ యూనిట్ నిర్మాణ పనుల ప్రగతిని వివరించారు. రాష్ట్రంలో చేనేతరంగ సమస్యలు, పరిష్కార మార్గాలపై సచివాలయంలో మంత్రి తుమ్మల సమక్షంలో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ప్రతినిధులు రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను ప్రదర్శించారు.